క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన మహమ్మద్ గౌరీకి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని తమ స్వగృహంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో భూపాల్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు

తాడూరు: దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో న్యాయసేవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల స్వేచ్ఛ హరించొద్దన్నారు. వారితో గౌరవంగా మెలగాలన్నారు. దివ్యాంగులతో కించపరిస్తే దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం 6 నెలల నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.50వేల నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, పారా లీగల్ వలంటీర్ అరుణ పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఫిర్యాదు



కల్వకుర్తి రూరల్: కొందరికి పట్టణాలతో పాటు గ్రామాల్లో ఓటు హక్కు ఉందని అధికారులు గుర్తించి ఒకచోట తొలగించాలని ఆర్డీఓ శ్రీను నాయక్‌కు వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో నాయకులు కలిసి గ్రామంలో ఓటు ఉన్నా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఓటరుగా నమోదు చేసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో బండి నారాయణమూర్తి, బాలరాజు, మల్లేష్, నేరటి మల్లేష్ ఉన్నారు.

రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. రేషన్‌కార్డులో ఉన్నవారికి రుణాలు ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. నైపుణ్యం, అర్హత ఉన్న యువతీ, యువకులకు రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే రూ.3 లక్షలు సరిపోవని, రూ.10 నుంచి రూ.15 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మల్లికార్జున్, భీరయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ పనులు ముగించుకొని జిల్లా కేంద్రానికి స్కూటీపై బయలుదేరాడు. దేశిటిక్యాల సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొనడంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. మండలం పోతిరెడ్డిపల్లి మండలంలోని బలాన్‌పల్లి మధ్యన వాగునుంచి పోలిరెడ్డిపల్లికి చెందిన నాగరాజు, సాయికుమార్‌ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పెట్రోలింగ్ సిబ్బంది గమనించి ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

చారకొండ: మండలంలోని గోకారం చెరువు నుంచి శేరిఅప్పారెడ్డి పల్లి తూర్పు తండాకు ఎలాంటి అనుమతులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం ఎస్ఐ శంషోద్దిన్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పై కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ స్వాధీనం

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరారం గేట్ సమీపంలో పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తర లిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. రామగిరికి చెందిన డ్రైవర్ మద్దెలబండ కురుమూర్తి, మంతటి గ్రామానికి చెందిన బోంకూరి మల్లయ్యలపై ఎస్ఆర్ఓ రమేష్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ కురుమూర్తి, ఓనర్ మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.11 లక్షలకు తైబజార్ వేలం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం తైబజార్, పశువులు, మేకలు, గొర్రెల సంతకు వేలం పాట నిర్వహించారు. ముందుగా పశువులు, మేకలు, గొర్రెల సంతకు వేలం పాట నిర్వహించగా ఆరు మంది టెండర్ దారులు ముందుకు రాలేదు. సంతలో భద్రత లేదని, సరైన స్థలం లేక ప్లాట్ల యజమానులు ఇబ్బంది పెడుతున్నారని టెండర్ దారులు ఆసక్తి చూపలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ పశువుల సంతకు రూ. 33.63 లక్షలకు వేలం పాడగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ 10 శాతం అదనంగా రూ. 36 లక్షల 99 వేల 300లతో వేలం పాట నిర్వహించగా 6 మంది టెండర్‌దారులు ఎవరూ ముందుకు రాలేదు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ యాదయ్య ఎన్ని సార్లు సముదాయించినా టెండర్‌దారులు మౌనంగా ఉండిపోయారు. దీంతో పశువులు, మేకలు, గొర్రెల సంతను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. అనంతరం తైబజార్‌కు వేలం పాట నిర్వహించగా 10 మంది టెండర్‌దారులు పాల్గొనగా...కనకటి ఆంజనేయులు రూ. 11.11 లక్షలకు దక్కించుకున్నారు. పశువులు, మేకలు, గొర్రెల సంత వేలం పాటను వారం రోజుల్లో నిర్వహిస్తామని కమిషనర్ యాదయ్య తెలిపారు. వేలం దక్కించుకున్న టెండర్‌దారులు అధిక రేట్లు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్ని వసతులు కల్పిస్తాం...

మున్సిపాలిటీకి ఆదాయ వనరుగా ఉన్న పశువులు, మేకలు, గొర్రెల సంతకు అన్ని వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో సంతకు పర్మినెంట్ స్థలాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు. ఇప్పటికే పలు మార్లు ఎమ్మెల్యేతో చర్చించామని, కొన్ని రోజుల్లోనే స్థలం కేటాయిస్తామన్నారు. టెండర్‌దారులు ముందుకు రావాలని కోరారు. మున్సిపల్ పరిధిలో ప్రధాన ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించామని, అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ అనిత, సిబ్బంది ఖాన్, కౌన్సిలర్లు గౌరీశంకర్, తగురం శ్రీనివాసులు, సోమ్లా, రమేష్, టెండర్‌దారులు పాల్గొన్నారు.



తైబజార్ టెండర్ దక్కించుకున్న ఆంజనేయులు

ఆదాయంపై అధికారుల అశ్రద్ధ

మున్సిపాలిటీ ప్రధాన వనరులపై పాలకవర్గం, అధికారులు దృష్టి సారించడం లేదు. అనుభవ రాహిత్యమో, అలసత్వమో కానీ మున్సిపాలిటీకి ఆదాయం రావడం లేదు. ఆ దిశగా ఆలోచనే చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి పశువులు, మేకలు, గొర్రెల సంతతో పాటు తైబజార్ ఎంతో ముఖ్యం. అదనపు ఆదాయ వనరులపై అధికారులూ దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకుల మాటలకు తల ఊపడం తప్పా... ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టడం లేదు. దీంతో అచ్చంపేట మున్సిపాలిటీ అభివృద్ధి కుంటు పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



లింగాల: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టవిరుద్ధమని కోనేరు సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కైలాస సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని దారారంలో ఉపాధి కూలీలకు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. బాల్యవివాహాలపై చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గోపాల్, రూపేష్, శ్రీశైలం, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



అచ్చంపేట రూరల్: నిరుద్యోగులు రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ చిత్రపటాలకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

నాగర్‌కర్నూల్‌రూరల్: రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్ కోరారు. బుధవారం స్థానిక బస్టాండ్ కూడలిలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు నానిగౌడ్, వినోద్, శ్రీకాంత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిని ప్రక్షాళన చేయాలి



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వారిని ప్రక్షాళన చేయాలని మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ కోరారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బాలింత శ్యామల (23) మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చి విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే వారిని పరీక్షించి వారి ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ ఆస్పత్రులను నడుపుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమాలు జరగకుండా చూడాలి

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఏప్రిల్‌లో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, గిరిజన సంఘం మండల నాయకుడు సరీరాం నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు బ్రహ్మోత్సవాలకు వివిధ సమస్యలపై, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం మండల నాయకులు హన్మంతు నాయక్, జూమ్లా నాయక్, రవినాయక్, శంకర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలి

తెలకపల్లి: ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు ఎత్తేయాలని స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓయూలో ర్యాలీలు, నిరసనలు నిషేధించడం సరికాదన్నారు. జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు రమేష్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై టెలీకాన్ఫరెన్స్

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్ తన కార్యాలయం నుంచి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా సెల్: 9440648324, 9885017701 నంబర్లను సంప్రదించాలని కోరారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బోరున విలపించిన విద్యార్థులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. పాఠశాలను వీడిపోతున్నందుకు భావోద్వేగానికి గురై బోరున విలపించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతుండగానే దుఖాన్ని ఆపుకోలేకపోయారు. కొందరు ఉపాధ్యాయులు సైతం భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఎంఈఓ సత్యనారాయణ శెట్టి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

కల్వకుర్తి: కులవివక్షత నిర్మూలనకు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భరత్ వినతిని అందజేశారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనుకు వినతిని అందజేశారు. దళితులపై జరుగుతున్న దాడులను నివారించాలని కోరారు. భామయ్య, వెంకటయ్య, శ్రీను, రామస్వామి, రాము, శంకర్‌లు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రత్యేక పూజలు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వరంలో బుధవారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన వేముల నరేందర్‌రావుతో పాటు ముఖ్య నాయకులు ఆలయం పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానమాచరించి గణపతిపూజ, శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మండికారి బాలాజీ, రేణయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణ

కోడేరు: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే దీక్షలు బుధవారం విరమించారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడంతో దీక్ష విరమించినట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య తెలిపారు. అనంతరం దీక్షను విరమించి మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జోగు నాగశేషయ్య, నర్సింహ, రాజు, పాస్టర్ ఎజ్రా, ఆదిసోమనాథ్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నాగర్‌కర్నూల్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించడంపై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నాగర్‌కర్నూల్‌లో ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు, కొల్లాపూర్‌లో సీఎం చిత్రపటానికి, పెద్దకొత్తపల్లిలో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు అదేవిధంగా కొల్లాపూర్, వెల్దండ, లింగాలలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. డప్పులతో ర్యాలీలు నిర్వహించారు.



లింగాలలో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న గర్భిణులకు మెరుగైన సేవలు అందించేందుకు హైడ్రాలిక్ టేబుల్స్, అధునాతన పరికరాలను లేబర్ రూమ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధన్యం ఇస్తారని వివరించారు. ఆస్పత్రిలో ప్రత్యేకంగా సాధారణ ప్రసవాలపై 18 నెలలు శిక్షణ పొందిన 9 మంది మెడ్‌వైఫ్‌లు ఉన్నారని, స్త్రీ వైద్య నిపుణులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్ఓడీ డా.నీలిమ, డా. సుప్రియ, రవిశంకర్ నాయక్, డాక్టర్ అజీమ్,డా. కవిత పాల్గొన్నారు.



హైడ్రాలిక్ మంచాలను ప్రారంభిస్తున్న జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు

బడ్జెట్‌పై నాయకుల స్పందన

ఖర్చుచేసి చూపించాలి..



ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఈ బడ్జెట్‌లో కూడా తగిన నిధులు కేటాయించకపోవడం బాధాకరం. రాష్ట్ర జిల్లా రైతాంగానికి వరప్రదాయిని అయిన ఎంజీకేఎల్ఐ, ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపట్టాలి. బడ్జెట్‌ను అంకెలలో కాకుండా ఖర్చుచేసి చూపించాలి. ఐదేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్, ఇండస్ట్రీయల్ పాలసీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలి.

– ఎం.బాల్‌నర్సింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి

అంకెల గారడీ బడ్జెట్



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు 420 హామీలు, ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించలేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలకు మంగళం పాడారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ సంక్షేమాన్ని విస్మరించింది.

-జైపాల్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బిజినేపల్లి: భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేపట్టి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడు రాహుల్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు అసెంబ్లీలో ఆమోదం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాల్యానాయక్, నాయకులు మ్యాతరి సత్యం, కృష్ణయ్య, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని ప్రత్యేక పూజలు

మన్ననూర్: అస్వస్థతకు గురైన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీలో చంద్రు బాపూజీ సమక్షంలో బంజారాల కులదైవం మత్రుసాద్ స్వామిని వేడుకున్నారు. రాజారాం, తుల్చ, గోపాల్, హరి, లక్ష్మణ్, తిరుపతి, నాను, మహిలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

తిమ్మాజిపేట: మండలంలోని గొరిట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రవాణా చార్జీల కోసం మొత్తం 32 మంది విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జుట్టు ఉత్తరయ్య, ప్రధాన కార్యదర్శి జన్ను వెంకటస్వామి రూ.11,200 లు సమకూర్చి హెచ్ఎంకు అందజేశారు. అదేవిధంగా పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం సరేష్, చైర్మన్ వాసీమా బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తాడూరు/లింగాల: తాడూరు మండలంలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాల, లింగాల మండలంలోని చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన వారికి హెచ్ఎం శేషగిరి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, మధు, నరేష్, మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

లింగాల మండలంలోని అప్పాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ బషీర్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్ రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

భూమిపూజ

కోడేరు: మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్, కోఆప్షన్ మాజీ సభ్యులు అబ్దుల్ కరీం భూమి పూజ చేశారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బాదేపల్లి నిరంజన్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న మారేపల్లి అలివేలు పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.5వేల ఇచ్చారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

కల్వకుర్తి రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దకల్ గ్రామానికి చెందిన 30 మంది రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫినోలెక్స్ స్ప్రింక్లర్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఓ మహేశ్వరి, తలసాని శ్రీధర్ రెడ్డి, నాగార్జున, సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, బాల్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యానికి నివాళి



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యం చిత్ర పటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాసులు, పొదిల రామయ్య, అశోక్, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను చేరదీసిన అధికారులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకారుపాములలో బుధవారం నలుగురు పిల్లలను తల్లిదండ్రులు వదిలి వెళ్లిపోయారు. గ్రామస్తులు గమనించి జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ రాజేశ్వరికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సుదర్శన్, కౌన్సిలర్ మల్లేష్, చైల్డ్ లైన్ కవితలు గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి నలుగురు పిల్లలను చేరదీసి నాగర్‌కర్నూల్ చైల్డ్ హెల్పర్ కమిటీ ఎదుట హాజరుపర్చారు. వారి ఆదేశాల ప్రకారం నలుగురి పిల్లలను మహబూబ్‌నగర్ శిశు గృహాలకు తరలించారు. కార్యక్రమంలో వెంకటరమణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం తీన్మార్ మల్లన్న టీం సభ్యులు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. మంచి మార్కులు సాధించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసూన, టీం సభ్యులు రుక్కులు గౌడ్, ఆనంద్ గౌడ్ పాఠశాల అధ్యక్షురాలు మహమూదా బేగం, శ్రీనివాసులు, గణేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బిజినేపల్లి: ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి పల్లెర్ల రఘునందన్‌రావు తెలిపారు. మండల వ్యాప్తంగా పది పరీక్షల కోసం 732 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్షల నిర్వహణకు నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలకు అవసరమగు 34 మంది ఇన్విజిలేటర్లను, వైద్య, పోలీసులు సిబ్బందిని నియమించినట్లు వివరించారు.